క్లుప్తంగా

నేదురుమల్లిని కలిసిన నేతలు



నేదురుమల్లిని కలిసిన నేతలు

సైదాపురం: వెంకటగిరి పట్టణంలోని నేదురుమల్లి నివాసం మంగళవారం వైఎస్ఆర్ సీపీ నేతలతో కోలాహలంగా మారింది. సైదాపురం మండలం నుంచి మండల కన్వీనర్ ఎం.రవికుమార్ యాదవ్, కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు శివకుమార్, మండలనేతలు రామ్‌గోపాల్‌రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు మోహన్‌రావు కలిశారు. మండలంలో జరిగిన పోలింగ్ సరళిని వారు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి వివరించారు.

యువతకు క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడాసామగ్రి అందజేస్తున్న చెంచురాఘవరెడ్డి

కోట: కర్లపూడికి చెందిన వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకుడు, సిద్ధవరం సొసైటీ మాజీ చైర్మన్ సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి యువతకు క్రీడాసామగ్రి అందజేశారు. క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా రూ.30 వేలు విలువైన క్రికెట్, వాలీబాల్ కిట్లను అందజేశారు. మంగళవారం కర్లపూడిలోని చెంచురాఘవరెడ్డి నివాసంలో క్రీడాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పాముల సురేంద్ర, శ్రీహర్ష, రాజ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను వినియోగించుకోండి



సైదాదుపల్లి గ్రామంలో ఆరోగ్య సురక్ష శిబిరం

రాపూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్యానికి పెద్దపీట వేసి ఎన్నో రకాల వైద్యసేవలను ఉచితంగా అందుబాటులోకి తెచ్చారని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యురాలు సుదర్శనమ్మ అన్నారు. రాపూరు మండలం సైదాదుపల్లి గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు ఇంటి వద్దే ఉచిత వైద్యం అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్ర ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నజ్మా, గురవయ్య, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పోలీసుల కార్డన్‌సెర్చ్



పట్టుబడిన మోటార్ సైకిళ్లతో సూళ్లూరుపేట పోలీసులు

సూళ్లూరుపేట: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో సూళ్లూరుపేట సీఐ మధుబాబు, ఎస్‌ఐ కె.రహీంరెడ్డి ఆధ్వర్యంలో మంగళవానం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా ఉన్న కొంతమందిని తనిఖీలు చేయగా ఏడు మోటార్‌సైకిళ్ల ఎలాంటి రికార్డులు లేకపోవడంతో దొంగబండ్లుగా భావించి స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలో మోటార్‌సైకిళ్ల ఎత్తుకెళ్లే వారి సంఖ్య ఇక్కడా బాగానే ఉన్నట్టుగా ఉందని పోలీసులు అంచనాలు వేస్తున్నారు. మోటార్‌సైకిళ్లకు సరైన ఆధారాలు, రికార్డులు చూపించి తీసుకెళ్లవచ్చునని లేదంటే దొంగబండ్లుగా భావించి సీజ్ చేస్తామని ఎస్‌ఐ రహీంరెడ్డి తెలిపారు.

గిరిజనులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న యానాదుల సంక్షేమ సంఘం నాయకులు

దక్కిలి: మండలంలోని మోపూరు రెవెన్యూలో సర్వే నెంబరు 1కి సంబంధించి గత కొంత కాలంగా వివాదాస్పదంగా ఉన్న భూములకు సంబంధించి జాయింట్ సర్వే నిర్వహించి గిరిజనులకు న్యాయం చేయాలని యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబరు 1లో ఉన్న భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం మేత పొరంబోకు, అనాధీనం అని ఉండగా ఆ భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులపై ఫారెస్ట్ శాఖ అధికారులు అక్రమంగా కేసులు పెడుతున్నారని తెలియజేశారు. గత నెలలో గిరిజనులను అరెస్ట్ చేసి వారిపై దాడులు కూడా చేశారన్నారు. దీంతో స్పందించిన తహసీల్దార్ శ్రీనివాస్ త్వరలో ఫారెస్ట్, రెవెన్యూ అధికారులతో జాయింట్ సర్వే నిర్వహించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కేసీ పెంచలయ్య, తలపల మల్లికార్జునరావు, ఇండ్ల అర్జున్, చెంబేటి ఉషా పాల్గొన్నారు.

నారసింహుని వైభవం



హంస వాహనంపై ఊరేగుతూ ....



హనుమంతునిపై లక్ష్మీనారసింహుడు

పెంచలకోన లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం రాత్రి స్వామివారు హనుమంత వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవ ముందు కళాకారుల ప్రదర్శనలు కనవిందు చేశాయి.

\- రాపూరు



వేడుకగా ఊంజల్ సేవ



వైభవంగా సాగిన క్షేత్రోత్సవం





కనువిందు చేసిన కళాకారుల నృత్య ప్రదర్శనలు

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

నాయుడుపేట టౌన్: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు, నాయకులు, యువత సహకరించాలని నాయడునేట డీఎస్పీ శ్రీనివాస రెడ్డి పెర్కొ న్నారు. జిల్లా నూతన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు అసాంఘిక కార్యక్రమాల కట్టడే లక్ష్యంగా డివిజన్ పరిధిలో పలు చోట్ల కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. మంగళవారం నాయుడుపేట పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కాలనీలో రైల్వే గేటు అవతలి ప్రాంతంలో డీఎస్పీ సారథ్యంలో సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ గోపి, ఓజిలి ఎస్ఐ రవిబాబు పోలీసులతో ఇంటింటా తనిఖీలు చేపట్టారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఏవరినైనా ఉపేక్షించేది ఉండదని వారిపై కఠిన చర్యలు చేపడుతామని డీఎస్పీ హెచ్చరించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనలతోపాటు పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాయుడుపేట డివిజన్ పరిధిలో ర్యాలీలు, వేడుకలు, బహిరంగ సమావేశాలు పూర్తిగా నిషిద్ధమని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఎన్నికలు సంబంధించి గెలుపు ఓటమిలపై కూడళ్ల వద్ద చర్చించడం వంటివి చేయరాదన్నారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తి అయిన తరువాత కూడా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు



నాయుడుపేట ఎన్ఎస్ఆర్ కాలనీ కార్డన్‌సెర్చ్‌లో స్థానికులతో మాట్లాడిన డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

ఓజిలి: ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఘర్షణలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఓజిలి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహణ పూర్తి కావడంతో ప్రజలంతా కలసిమెలసి ఉండాలన్నారు. రాజకీయ కక్షలతో కౌంటింగ్ సమయంలో వివాదాలకు వెళ్లకుండా ఉండాలన్నారు. మండలంలో 26 పంచాయితీలలో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. అనుమతులు లేకుండా ఏ కార్యక్రమాలు నిర్వహించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈయన వెంట ఎస్ఐ రవిబాబు ఉన్నారు.

బకాయిల వసూళ్లు పూర్తి చేయండి

చిల్లకూరు: పంచాయతీలలో ఇంటి పన్ను బకాయిలను త్వరగా వసూలు పూర్తి చేయాలని ఈఓపీఆర్డీ మాణిక్యం సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్ను బకాయిలు ఇంకా పూర్తి కాలేదని దీనిపై దృష్టి పెట్టాలని అన్నారు. ప్రతి ఏడాది మార్చిలోగా బకాయిలు పూర్తి చేస్తుండే వారని అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బకాయిల వసూళ్లను కొంత ఆపి ఉన్నందున మరలా చేపట్టి పూర్తి చేయాలని అన్నారు. అలాగే పంచాయతీలలో ఎవరైనా అనుమతులు లేకుండా లే అవుట్‌లు వేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనధికారిక లేఅవుట్లపై సమాచారం ఇవ్వాలని ఆయన పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నాయుడుపేట టౌన్: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30కు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు కురుగొండ ధనలక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలు తదితర విషయాలపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష జరుగుతుందన్నారు. మండల స్థాయి అధికారులు వారి శాఖ పరిధిలోని ప్రగతి నివేదికలను అందజేయాలని ఎంపీడీఓ కోరారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

అనుమానితుల సమాచారం ఇవ్వండి

గూడూరు రూరల్: ఎన్నికలు ముగిసిన అనంతరం అల్లర్లు సృష్టించేందుకు ఎవరైనా కొత్త వ్యక్తులు పట్టణంలో సంచరిస్తే అలాంటి వారిపై పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణ సూచించారు. రెండో పట్టణ పరిధిలోని గాంధీనగర్, ఇందిరానగర్, ప్రశాంతి నగర్‌లలో ఇల్లులు జల్లెడ పట్టి కొత్త వారిని ప్రశ్నించి వారి వద్ద నుంచి పూర్తి సమాచారం రాబట్టారు. అలాగే పలు వాహనాలకు సరైన ధ్రువపత్రాలు లేక పోవడంతో వాటిని సీజ్ చేసి స్టేషన్లకు తరలించారు. అయన వెంట రెండో పట్టణ సీఐ రవికిరణ్, గూడూరు రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి, రూరల్ ఎస్ఐ మనోజ్‌రెడ్డి, చిల్లకూరు ఎస్ఐ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొత్త వ్యక్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

మోటార్‌బైక్‌ను ఢీకొన్న లారీ

నాయుడుపేట టౌన్: మేనకూరు హిందుస్థాన్ పరిశ్రమ సమీపంలో రహదారిపై మంగళవారం రాత్రి మోటార్‌బైక్‌ను లారీ ఢీకొంది. ఈ సంఘటనలో బైక్ నడుపుతున్న సాలపక్షి నాగులుబాబు(30) మృత్యువాత పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఓజిలి మండలం తిరుమలపూడి గ్రామానికి చెందిన నాగులుబాబు మంగళవారం రాత్రి భీమవరం గ్రామంలోని అత్తారింటికి బైక్‌లో బయల్దేరాడు. మార్గమధ్యలో మేనకూరు గ్రామంలోని హిందుస్థాన్ పరిశ్రమ సమీపంలో రహదారి వద్ద నాయుడుపేట నుంచి వెంకటగిరి వైపు వెళుతున్న లారీ వేగంగా వచ్చి నాగులుబాబు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్ నడుపుతున్న నాగులు బాబు అక్కడికక్కడే మరణించాడు. ఈ విషయమై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన లారీను స్వాధీనం చేసుకున్నారు. మృత దేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు నాగులుబాబు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ తల్లితోపాటు భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాడు. రోడ్డు ప్రమాదంలో నాగులుబాబు మృతి చెందినట్లు సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ప్రభుత్వ వైద్యశాల వద్దకు చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాగులుబాబు



సాలపక్షి నాగులు బాబు(ఫైల్)

యోగ లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ఉత్సవమూర్తులకు హోమాలు

దక్కిలి: మండలంలోని వెలగొండలు కింద (పెదకోన) వెలసియున్న యోగ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం స్వామివారికి వివిధ రకాలు పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, హోమాలు, రాత్రి గరుడసేవ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకుడు విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఉదయం 10గంటలకు లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు.

రెండు లారీలు ఢీ



అద్దాలు పగిలిన లారీ

చిల్లకూరు: మండలంలోని బూదనం సమీపంలో చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై నెల్లూరు నుంచి నాయుడుపేట వైపు వెళుతున్న ఒక లారీని వెనక వస్తున్న మరో లారీ ఢీ కొనడంతో వెనక లారీ అద్దాలు పగిలాయి. ఈ సమయంలో పక్కనే వెళుతున్న వాహనాలకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఈ సంఘటన మంగళవారం ఉదయం బూదనం సమీపంలోని తిరుమల పాల డెయిరీ సమీపంలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎవ్వరికి ఎలాంటి గాయాలు కాలేదు. దీనిపై రెండు లారీల డ్రైవర్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

మండుతున్న ఎండలు



ఎండిపోయిన పులికాట్ సరస్సు



వడగాడ్పులకు పులికాట్ సరస్సులో ముందుకు వెళ్లలేక ఆగిపోయిన ఆటో

\- ఒక్కసారిగా ఉష్ణోగ్రతల్లో మార్పులు

సూళ్లూరుపేట: నియోజకవర్గంలో ఈ నెల ప్రారంభం నుంచి ఒక్కసారిగా వేసవి ఎండల తాపం విపరీతంగా పెరిగిపోయింది. వారం రోజుల నుంచి ప్రతి రోజూ 42 నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఎవరూ బయట తిరగలేని పరిస్థితి ఏర్పడింది. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో వాతావరణం కొంత చల్లబడినప్పటికీ మళ్లీ ఎండ తీవ్రతకు ఇంట్లో నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. మామూలుగా వేసవిలో కత్తెర వస్తుందని, సుమారు 15 రోజులపాటు కత్తెర ఎండల దెబ్బ తీవ్రంగా ఉంటుందని, అలాగే రోహిణి కార్తెలో వచ్చే ఎండలకు రోళ్లు సైతం పగిలిపోతాయనేది పెద్దల నానుడి. ఆ పరిస్థితి గత వారం రోజుల నుంచి కళ్లకు కట్టినట్టుగా కనిపిస్తోంది. మబ్బులు పడుతున్నట్టుగానే ఉంటూ ఎండ తీవ్రత మాత్రం ఎక్కువగా ఉంది. ముఖ్యంగా రోజువారీ కూలి పనులు చేసుకునే వారు, జాతీయ ఉపాధి పనులకు వెళ్లేవారు, వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఎండల దెబ్బకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పులికాట్ సరస్సులో వడగాడ్పుల కారణంగా ఎండిపోయి ఎడారిలా మారింది. వడగాడ్పులకు సరస్సులో దువ్వ మట్టి అంతా లేచి సమీప గ్రామాల ప్రజలను ఇబ్బంది పెడుతోంది. సూళ్లూరుపేట-శ్రీహరికోట రోడ్డుపై ఈ దువ్వ మట్టి అరలుగా పేరుకుంటోంది. వేసవి ఎండలో వడగాడ్పుల దెబ్బకు సూళ్లూరుపేట-శ్రీహరికోట రోడ్డులో పులికాట్ ప్రాంతం వచ్చే చోట వాహనాలు వెళ్లలేని పరిస్థితులు అప్పుడప్పుడూ కనిపిస్తున్నాయి.

కండలేరులో 6.717 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 6.717 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 30 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వెంకటగిరిపై వైఎస్ఆర్ సీపీ జెండా



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డితో వైఎస్ఆర్ సీపీ నాయకులు

\- నేదురుమల్లిని కలసిన నియోజకవర్గ నేతలు.

వెంకటగిరి రూరల్: వెంకటగిరి ఎమ్మెల్యేగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని నిర్ణయిస్తూ ప్రజా తీర్పు వెలువడుతుందని వైఎస్ఆర్ సీపీ నేతలు ఆందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో మంగళవారం వైఎస్ఆర్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డిని వెంకటగిరి పట్టణం, రూరల్, బాలాయపల్లి, డక్కిలి, రాపూరు, సైదాపురం మండలాలకు చెందిన నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కార్యకర్తలతో కొంతసేపు ముచ్చటించారు. గత మెజారిటీ కన్నా అన్నీ మండలాల్లో అత్యధిక మెజారిటీతో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యే కాబోతున్నారని ఆనందం వ్యక్తం చేశారు.

వేడుకగా కరిమాణిక్య స్వామి బ్రహ్మోత్సవాలు



ఆలయం వద్ద ధ్వజారోహణం



ధ్వజారోహణ వస్త్రంతో ఆలయంలో ప్రదక్షిణలు

నాయుడుపేట టౌన్: తుమ్మూరు గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్య స్వామి బ్రహ్మోత్సవాలను టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ధ్వజారోహణతో ఘనంగా ప్రారంభించారు. బ్రహ్మోత్సవ వేడుకలను టీటీడీ కార్యనిర్వహణాధికారి ఏవీ ధర్మారెడ్డి సారథ్యంలో వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేపట్టారు. బ్రహోత్సవాల్లో మొదటి రోజు మంగళవారం నాడు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణ జరిపి కోడి ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. రాత్రి స్వామివార్లకు ఏకాంత సేవ పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఆలయ ఇన్‌స్పెక్టర్‌లు హరిరెడ్డి, సుధీర్, ఆలయ ప్రధాన అర్చకులు శేషాద్రిస్వామి, కిషన్‌స్వామి, టీటీడీ వేదపండితులు హర్షవర్ధన్ స్వామి, శ్రీహరి స్వామి, రంగనాథస్వామి, బాలాజీస్వామి, కరిమాణిక్యస్వామి వార్ల భక్తబృందం, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



శేషవాహనంపై ఊరేగుతున్న కరిమాణిక్య స్వామి

నేడు స్వామివారి హనుమంత సేవ

తుమ్మూరు కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామివారికి తిరుచ్చి ఉత్సవం, రాత్రి హనుమంత వాహన సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిరెడ్డి తెలిపారు.

హనుమంతునిపై లక్ష్మీనరసింహుడు





ఆలయ ప్రాకారోత్సవంలో లక్ష్మీనరసింహస్వామి , హనుమంత వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహ స్వామి

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో వెలసియున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో బాగంగా మంగళవారం స్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం స్వామితో పాటుగా చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మీలకు సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం అభిషేకాలు చేపట్టి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం లఘుపూర్ణాహుతి, తిరుచ్చి ఉత్సవం, ప్రాకారోత్సవం చేపట్టారు. భక్తులకు భారీ గాఅన్నదానం చేపట్టారు. సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహించి, స్వామి వారిని హనుమంత వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా ఇస్కాన్ సిటీ నెల్లూరుకు చెందిన వేలూరు జగన్‌మోహన్‌రెడ్డి, లక్ష్మీప్రసన్న, తూర్పుకనుపూరు ముత్యాలమ్మ ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, పెరికల గోపాలయ్య, సుబ్బమ్మ, గూడూరుకు చెందిన డాక్టర్ సీఆర్ రెడ్డి హాస్పిటల్స్ వైద్యులు జనార్దనరెడ్డి, రోహిణి వ్యవహరించారు. ఆలయ నిర్మాణ స్ఫూర్తి ప్రదాత, యరటపల్లి జానకిరామిరెడ్డి, ఆలయ ఈఓ తాతా శ్రీనివాసులు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పర్యవేక్షించారు.

ఉపాధి హామీలో అవినీతిపై నివేదిక



మాట్లాడుతున్న ఏపీడీ రవికుమార్, ఎంపీడీఓ అన్నపూర్ణారావు

పెళ్లకూరు: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద శిరసనంబేడు గ్రామంలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఏపీడీ రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం శిరసనంబేడు గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలపై ఆయన తనిఖీ చేశారు. గ్రామంలో జరుగుతున్న కేటిల్‌పాండ్ పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. నాలుగు వారాలుగా చేసిన పనులకు డబ్బులు చెల్లించలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన పలువురు వ్యాపారులు, ఉద్యోగులు, ధనికులకు జాబ్‌కార్డులు మంజూరు చేసి వారి పేరుతో నగదు జమ చేసి ఏటీఎం కార్డులు కూడా తన వద్ద ఉంచుకొని ప్రభుత్వ సొమ్ము స్వాహా చేస్తున్నట్లు ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఉపాధి కూలీలు ఫిర్యాదు చేశారు. అవినీతికి పాల్పడడంతో ఎఫ్ఏ మల్లికార్జున్‌ను విధుల నుండి తొలగించి రూ.2లక్షలకు పైగా రికవరీ విధించినప్పటికీ ఒక్క పైసా చెల్లించలేదని కూలీలు వివరించారు. అలాంటి ఎఫ్ఏ భార్య లత పేరుతో తిరిగి బాధ్యతలు ఎలా అప్పగించారంటూ ఏపీడీని ప్రశ్నించారు. ఈ విషయమై ఏపీడీ మాట్లాడుతూ గ్రామంలో చోటు చేసుకున్న ఉపాధిహామీ అవకతవకలపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ అన్నపూర్ణరావు, ఏపీఓ దయానంద్, సిబ్బంది ఉన్నారు.